సాక్షి ఒడిశా

సోమవారం । 8 । మే । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయంలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన హుండీ ఆదాయాన్ని ఆలయ పాలకవర్గం ఆదివారం లెక్కించారు. ఇందులో నగదు రూ.5,12,747లు, బంగారం 8.4 గ్రాములు, వెండి 136.95 గ్రాములు వచ్చాయని అధికారులు వెల్లడించారు.



మజ్జిగౌరి సన్నిధిలో ఆంధ్రప్రదేశ్ స్పీకర్

- 8లో.



ఆలోచింపజేసిన కార్టూన్లు

- 8లో.

న్యూస్‌రీల్

నవరంగ్‌పూర్ ఎమ్మెల్యే సుడిగాలి పర్యటన



అలేఖ్ బాబా ఆశీర్వాదం తీసుకుంటున్న ఎమ్మెల్యే సదాశివ ప్రధానీ

కొరాపుట్: నవరంగ్‌పూర్ ఎమ్మెల్యే సదాశివ ప్రధాన్ జిల్లాలో ఆదివారం సుడిగాలి పర్యటన చేశారు. కొసాగుమడ సమితి సన్న అంబాగుడ పంచాయతీ దుంద్రిగుడ, దడియాగుడ, లడుగుడ, పోలియా గ్రామాలను సందర్శించారు. అలేఖ్‌బాబా మఠంలో ప్రార్థనలు చేశారు. అక్కడి గురువులకు పాద నమస్కారం చేసి, ఆశీర్వాదం పొందారు. తన కోటా నిధులతో మఠంలో సాధువులకు వసతులు కల్పిస్తానని హామీ ఇచ్చారు. త్రినాథ దేవాలయం, దేవాలయ కమిటీలతో సమావేశమయ్యారు. ఆలయ ప్రాంగణాలలో సామాజిక భవనాల నిర్మాణానికి నిధులు కేటాయిస్తానని హామీ ఇచ్చారు. పర్యటనలో బీజేడీ నాయకులు, సమితి సభ్యులు, సర్పంచ్‌లు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

యాసిడ్ బాధితురాలికి ఆర్థికసాయం

జయపురం: పట్టణంలోని క్రిస్టియన్‌పేట మూడో లైన్‌లో ఇటీవల యాసిడ్ దాడికి గురైన బాధితురాలికి రూ.లక్ష ఆర్థిక సాయాన్ని కొరాపుట్ జిల్లా న్యాయసేవా ప్రాధికరణ తరపున ఆదివారం అందించారు. ఆమె చికిత్స నిమిత్తం మరికొంత ఆర్థికసాయం సమకూర్చేందుకు న్యాయసేవా ప్రాధికరణ కార్యదర్శి సుమన్ జెనా తెలియజేశారు. క్రిస్టియన్ పేటకు చెందిన ఓ వ్యక్తి బాధిత బాలికను తన ఇంటికి పిలిచి, శారీరకంగా వేధించడంతో పాటు యాసిడ్‌తో దాడి చేశాడు. బాలిక ఇంటికి చేరుకొని, విషయాన్ని కుటుంబ సభ్యులకు వివరించగా, కుటుంబ సభ్యులు వెంటనే జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న సామాజిక కార్యకర్త రాజపులక మహంతి బాధితురాలి చికిత్స నిమిత్తం ఆర్థికసాయం చేయాలని జిల్లా న్యాయసేవా సంస్థను ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో జిల్లా న్యాయమూర్తి జయపురం సత్యనారాయణ మిశ్రా ఆదేశాల మేరకు బాధిత కుటుంబానికి రూ.లక్ష సాయాన్ని అందజేశారు. అలాగే మెరుగైన చికిత్స నిమిత్తం కటక్ పంపించాస్తామని భరోసా ఇచ్చారు.

జేకే పేపర్‌మిల్‌లో వైద్య శిబిరం



శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఏడీఎం ప్రధాన్

రాయగడ: సదరు సమితి సమీపంలోని జేకే పేపర్‌మిల్ ఆధ్వర్యంలో ఉచిత మల్టీ స్పెషాలిటీ వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. జిల్లా అదనపు మేజిస్ట్రేట్ ధర్మానంద ప్రధాన్ ముఖ్యఅతిథిగా హాజరై, దీనిని ప్రారంభించారు. జిల్లాలో ఎంతో ప్రాముఖ్యత పొందిన జేకే పేపర్‌మిల్ ఇటువంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. విశాఖపట్నానికి చెందిన మెడికవర్ హాస్పిటల్ సౌజన్యంతో మిల్ యాజమాన్యం నిర్వహించిన ఈ శిబిరంలో 206మందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైద్యులు అనీత త్రిపాఠి, ప్రవీణ్, రాధిక, అర్చన బెహరా, పేపర్‌మిల్ ఉపాధ్యక్షుడు(కమర్షియల్) విశ్వజిత్ ద్వివేది, హెచ్.ఖమారి తదితరులు పాల్గొన్నారు.

చికిత్స అందక క్షతగాత్రురాలి మృతి

జయపురం: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి తనకు ప్రభుత్వం ఇచ్చిన బిజూ ఆరోగ్య కార్డులో డబ్బులు పూర్తిగా ఖర్చు కావడంతో చికిత్స నిలిచిపోయి మరణించింది. వివరాలు ఇలా ఉన్నాయి. ఏప్రిల్ 7న బొయిపరిగుడ సమితి కొలారు పంచాయతీ ముదులిగుడ గ్రామానికి చెందిన దుర్లభ ఖీలో(50) తన భార్య దుల్లభతో సైకిల్‌పై టంగినగుడ గ్రామం మీదుగా బొయిపరిగుడ వెళ్తున్నాడు. 151 బీఎస్‌ఎఫ్ బెటాలియన్ వద్ద సరుకులు కొనుగోలు చేసి, తీసుకువస్తుండగా ట్రక్కు ఢీకొంది. బాధితురాలు దుల్లభను బొయిపరిగుడ కమ్యూనిటీ వైద్య కేంద్రానికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం జయపురం, అనంతర భువనేశ్వర్‌లో ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకువెళ్లారు. అప్పటి నుంచి బిజూ ఆరోగ్య కార్డుపై వైద్యం అందిస్తుండగా, ప్రభుత్వం నిర్ధేశించిన నగదు అయిపోవడంతో అర్ధాంతరంగా చికిత్స నిలిపోయింది.

వాడీవేడిగా ప్రచారం

- ఝార్సుగుడలో ఉప ఎన్నిక ప్రచారలో హేమాహేమీలు
- దీపాలి దాస్‌కు మద్దతుగా సీఎం నవీన్ బహిరంగ సభ
- బీజేపీ తరఫున హాజరైన కేంద్రమంత్రి ధరేంద్ర ప్రధాన్
- పరస్పరం విమర్శలు, హామీలతో హోరు



ఉప ఎన్నిక ప్రచార వేదికపై సీఎం నవీన్ పట్నాయక్‌తో దీపాలి దాస్, కుటుంబ సభ్యులు



సీఎం నవీన్ ఆశీర్వాదం తీసుకుంటున్న దృశ్యం

భువనేశ్వర్: ఝార్సుగుడ శాసనసభ నియోజకవర్గ ఉప ఎన్నిక ప్రచారం వేడివాడిగా సాగింది. అధికార, విపక్ష పార్టీల అభ్యర్థుల గెలుపు కోసం ఆయా పార్టీల కీలక నాయకులు ఆదివారం ప్రత్యక్షంగా ప్రచారం చేపట్టారు. బిజూ జనతాదళ్(బీజేడీ) అభ్యర్థి దీపాలీ దాస్‌కు మద్దతుగా పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ప్రచారం చేశారు. ప్రజలకు సేవ చేయడానికి ఈ గడ్డ ఆడపడుచుకు అవకాశం ఇవ్వాలని ఆయన పిలుపునిచ్చారు. నియోజకవర్గంలోని అమిలిపల్లిలో జరిగిన బహిరంగ సభలో సీఎం మాట్లాడారు. మాజీమంత్రి నవకిషోర్ దాస్ కుమార్తె దీపాలి దాస్ ఉన్నత చదువులు చదివి, సామాజిక సేవపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్న ఉజ్వల యువతిగా కొనియాడారు. అవకాశం లభిస్తే ఆమె తన తండ్రి తరహాలోనే సమర్థవంతమైన నాయకురాలిగా నిరూపించుకుంటుందని ప్రగాఢ విశ్వాసం వ్యక్తం చేశారు. మాజీమంత్రి నవకిషోర్ దాస్ ప్రజాదరణ పొందిన నాయకుడు, సమర్థవంతమైన మంత్రిగా సీఎం నవీన్ కొనియాడారు. ఈ నియోజకవర్గానికి ఆయన చేసిన సేవలు నిరంతరం నియోజకవర్గ ప్రజల మదిలో నిలిచి ఉంటాయన్నారు. తండ్రిని కోల్పోయి విషాదంలో చితికిన యువతిని ప్రతిపక్ష పార్టీలు అవమానానికి గురిచేయడం అత్యంత విచారకరమని వ్యాఖ్యానించారు. ఎన్నికల్లో గెలుపు, ఓటములు అంతర్లీనమని, ఎదుటి వారిని మానసికంగా బాధపెట్టడానికి ఏఒక్కరూ దిగజారకూడదని హితవు పలికారు. ప్రచార సమయంలో మర్యాద పాటించాలి. ఎవరినీ, ముఖ్యంగా మహిళలు మరియు ఆడపడుచుల్ని అగౌరవ పరచకూడదని నవీన్ తెలిపారు.



ప్రసంగిస్తున్న బీజేడీ అభ్యర్థి దీపాలి దాస్

దేశంలో నంబర్ 1..

పదంపూర్ నియోజకవర్గ ఉప ఎన్నికల సమయంలో తన తండ్రిని కోల్పోయిన బొర్గాసింగ్ బరిహాతో ప్రతిపక్ష పార్టీలు ఎలా ప్రవర్తించాయో అందరికీ తెలిసిందే అని సీఎం నవీన్ పేర్కొన్నారు. ప్రస్తుతం దీపాలితో కూడా అలాగే ప్రవర్తిస్తున్నారని, ఇది దురదృష్టకరమని విచారం వ్యక్తం చేశారు. నిరంతర అభివృద్ధి బిజూ జనతాదళ్ ఏకైక లక్ష్యమని పునరుద్ఘాటించారు. మహిళలు, రైతులు, యువత సంక్షేమం మరియు సాధికారత కోసం బీజేడీ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. ఝార్సుగుడ ప్రముఖ పారిశ్రామిక జిల్లాగా వెలుగొందుతోందని, జాతీయ స్థాయిలో నంబర్1 పారిశ్రామిక జిల్లాగా ఆవిష్కరించేందుకు ప్రభుత్వం పేర్కొన్నారు. త్వరలో జరగనున్న ఉప ఎన్నికలో బీజేడీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఈ నియోజకవర్గ ఆడపడుచుకు గెలిపించి నియోజకవర్గ బహుముఖ పురోగతిలో నిర్ణేతలు కావాలని పిలుపునిచ్చారు.

బీజేడీ పాలనలో బహుముఖ వైఫల్యం..



కొలబిరా ప్రచార సభలో ఐక్యత చాటుతున్న బీజేపీ ప్రముఖులు

భువనేశ్వర్: ఝార్సుగుడ అసెంబ్లీ నియోజకవర్గానికి జరగనున్న ఉప ఎన్నికలో బీజేపీ అభ్యర్థి టొంకొధొరొ త్రిపాఠి తరఫున పలువురు పార్టీ ప్రముఖులు ఆదివారం ప్రచారం చేశారు. ఈ సందర్భంగా కొలబిరా ప్రాంతంలో జరిగిన బహిరంగ సభలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ప్రభుత్వంపై ఘాటైన వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో బీజేడీ పాలన బహుముఖంగా విఫలమైందని దుయ్యబట్టారు. రాష్ట్రమంత్రికి కనీస రక్షణ కల్పించలేక పోయిందని విమర్శించారు. దీంతో ధీటైన మంత్రిని రాష్ట్రం కోల్పోయిందని, ఈ విచారకర పరిస్థితుల పరిణామంతో ఉప ఎన్నిక అనివార్యమైందని పేర్కొన్నారు. రాష్ట్రంలో బీజేడీ పాలన ఘోర వైఫల్యానికి ఇంతకంటే నిలువెత్తు ఉదాహరణ వేరొకటి ఉండదని భావోద్వేగంగా ప్రసంగించారు. రాష్ట్రంలో శాంతి, భద్రతల పరిస్థితి మరింత దయనీయంగా అల్లాడుతోందని, బలవంతపు వసూళ్ల కోసం సమర్థ అగర్వాల్‌ను అపహరించి హతమార్చడం, గుడ్డూ ముస్లింకు రాష్ట్రంలో ఆశ్రయం కల్పించడం, పశ్చిమ ఒడిశా సంబల్‌పూర్‌లో హనుమాన్ జయంతి పురస్కరించుకుని అల్లర్లు చెలరేగడం శాంతిభద్రతల వైఫల్యాన్ని నిరూపిస్తున్నాయన్నారు.

టొంకొధొరొ త్రిపాఠిని గెలిపించాలి..

రాష్ట్రంలో బీజేడీ ప్రభుత్వం ఇతర వెనుకబడిన వర్గాలు(ఓబీసీ) లకు వ్యతిరేకమని కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన ప్రసంగంలో ఆరోపించారు. రాష్ట్ర ప్రజలకు ప్రభుత్వ ఉద్యోగాలు, ఉన్నత విద్యాసంస్థల్లో ప్రవేశాలలో రాజ్యాంగబద్ధమైన 27శాతం ఓబీసీ రిజర్వేషన్ కల్పించని ఏకైక రాష్ట్రం ఒడిశా అని ప్రకటించారు. ఎన్నికల పబ్బం గుడుపుకొనేందుకు ప్రభుత్వం సామాజిక, విద్య, ఆర్థిక పరంగా వెనుకబడిన(ఎస్ఈబీసీ) వర్గాల సర్వే చేపట్టడం కంటి తుడుపు వైఖరిగా ఆక్షేపించారు. దీనిలో కూడా ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా అవకతవకలకు పాల్పడుతోందని, సర్వే నిర్వాహకులు ఇంటింటికీ వెళ్లి వివరాలు, సమాచారం సేకరించక పోవడం తార్కాణంగా పేర్కొన్నారు. మౌలిక వసతుల సౌకర్యాల్లో ఝార్సుగుడ వెనుకబడి ఉందని, ఆస్పత్రుల్లో సరిపడా వైద్యుల కొరత వంటి దైనందిన సమస్యలతో స్థానిక జిల్లా ఇంతవరకు ప్రభుత్వ కళాశాలకు నోచుకోకపోవడం అత్యంత విచారకరమని విమర్శించారు. ఝార్సుగుడ పారిశ్రామిక అభివృద్ధి, శాంతిభద్రతల పరిరక్షణ, విద్య, ఉపాధి రంగాల వనరులతో తులతూగేలా చేయడంలో నెలకొల్పేందుకు బీజేపీ అభ్యర్థి టొంకొధొరొ త్రిపాఠికి ఓటు వేసి ఎన్నుకోవాలని కేంద్ర మంత్రి కోరారు.

9న కొరాపుట్ జిల్లా బంద్



సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాహిణీపతి

జయపురం: స్థానిక పట్టణంలో కేంద్రప్రభుత్వ సంస్థలు నెలకొల్పాలని డిమాండ్ చేస్తూ ఈనెల 9న కొరాపుట్ జిల్లా బంద్‌కు జిల్లా కాంగ్రెస్ నేతలు పిలుపునిచ్చారు. ఈ మేరకు సన్నాహక సమావేశం స్థానిక బాబాసాహెబ్ కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు మీనాక్షి బాహిణీపతి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి మాట్లాడారు. జయపురంలో కేంద్ర విద్యాలయం ఏర్పాటు చేయటంలో కేంద్రప్రభుత్వం సవతి ప్రేమ చూపిస్తోందని దుయ్యబట్టారు. దీనిపై కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను పలుమార్లు కలిసి, వినతిపత్రం అందించినా ప్రయోజనం లేకపోయిందన్నారు. కొరాపుట్ జిల్లాపై బీజేపీ ప్రభుత్వానికి ఎందుకింత కక్ష అని ఆయన ప్రశ్నించారు. జయపురంలో కేంద్రీయ డ్రైవింగ్ శిక్షణ కేంద్రం, వెనుకబడిన వర్గాల వారికి జిల్లా లోనే ఉద్యోగాలు కల్పించాలన్న డిమాండ్లతో కొరాపుట్ జిల్లా బంద్‌కు పిలుపునిచ్చారు.

ప్రాణం తీసిన పాతకక్షలు



సనాతన్ బయికారి మృతదేహం



సనాతన్ బయికారి (ఫైల్)

బరంపురం: నగర శివారు ఆచార్య నేష్‌విహార్‌లో పాతకక్షల కేంద్రంగా ప్రత్యర్థిని దుండగులు మారణాయుధాలతో వేటాడి వేశారారు. సనాతన్ బయికారిపై దాడి చేసి హత్య ఘటన నగరంలో పెద్ద చర్చనీయాంసంగా మారింది. ఐఐసీ అధికారి భూపతి మహంతి తెలిపిన వివరాల ప్రకారం స్థానిక దుడుమా కాలనీ ఆచార్య విహార్‌లో నివసిస్తున్న సనాతన్ బయికారి మోటర్ బైక్‌పై వస్తున్న సమయంలో ప్రత్యర్థి వర్గానికి చెందిన దుండగులు వెంటాడి మారణాయుధాలతో దాడి చేసి, హతమార్చారు. ఈ మేరకు నేసు నమోదు చేసి, దర్యాప్తులో భాగం ఇద్దరు నిందితుల అరెస్ట్ చేశారు.

అగ్నిగంగమ్మను దర్శించుకున్న మంత్రి సరక



సిమిలిగుడలో మంత్రి సరకతో ఎమ్మెల్యేలు, నాయకులు

కొరాపుట్: రాష్ట్ర హరిజన, గిరిజన సంక్షేమశాఖ మంత్రి జగన్నాథ సరక జిల్లాలో ఆదివారం పర్యటించారు. సిమిలిగుడ పట్టణంలోని అగ్నిగంగమ్మ దేవాలయాన్ని సందర్శించారు. ప్రత్యేక పూజలు చేయడంతో పాటు ఆలయంలో జరుగుతున్న నిర్మాణ పనులను పరిశీలించారు. ఆలయ కమిటీ సభ్యులు మంత్రిని కలిసి, అభివృద్ధికి సహకరించాలని కోరారు. అనంతర పొట్టంగిలో మిషన్‌శక్తి నిధులతో నిర్మించిన ఫుడ్‌కోర్టు ప్రారంభించి, స్వయం సహాయక సంఘాల మహిళలకు అందజేశారు. నిశ్నముండా గ్రామాన్ని సందర్శించి, పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమాల్లో కొరాపుట సెంట్రల్ కో–ఆపరేటివ్ బ్యాంక్ అధ్యక్షుడు ఈశ్వర్‌చంద్ర పాణిగ్రాహి, పొట్టంగి ఎమ్మెల్యే పీతం పాఢి, కొరాపుట్ ఎమ్మెల్యే రఘురాం పాడాల్, ఎస్‌డీసీ చైర్మన్ చంద్రశేఖర్ మాఝి, మాజీ ఎమ్మెల్యే ప్రఫుల్ల పంగి, సునాబెడా మున్సిపల్ చైర్మన్ రాజేంద్రకుమార్ పాత్రొ, ఈశ్వర్ అల్లాడ తదితరులు పాల్గొన్నారు.



అగ్ని గంగమ్మను దర్శించుకుంటున్న మంత్రి జగన్నాథ సరక

రాష్ట్రపతి హెలీకాప్టర్‌తో సెల్ఫీ

- అనంతరం సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన ఫార్మాసిస్ట్
- ప్రథమ మహిళ భద్రతా వ్యవస్థపై విమర్శలు

భువనేశ్వర్: భారత రాష్ట్రపతి ద్రౌపదిముర్ము 3 రోజుల రాష్ట్ర పర్యటన గందరగోళంగా మారింది. ఆమె చివరి రోజు పర్యటనలో పలు సమస్యాత్మక పరిస్థితులు తలెత్తాయి. దీంతో రాష్ట్రపతి పర్యటనలో భద్రత లోపించిందనే ఆరోపణలు బలపడుతున్నాయి. మయూర్‌భంజ్ జిల్లా బరిపద మహారాజా శ్రీరామచంద్ర భంజ్‌దేవ్ విశ్వ విద్యాలయంలో శనివారం జరిగిన స్నాతకోత్సవంలో ఆమె ప్రసంగిస్తుండగా.. 9నిమిషాల పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగిన విషయం తెలిసిందే. ఈ వివాదం చల్లారక ముందే మరో వివాదం తెరకెక్కింది. సోషల్ మీడియా ఈ వ్యవహారాన్ని బట్టబయలు చేసింది. రాష్ట్ర పర్యటనలో భాగంగా ద్రౌపది ముర్ము శుక్రవారం మయూర్‌భంజ్ జిల్లా సిమిలిపాల్ టైగర్ రిజర్వ్(ఎస్‌టీఆర్)ను సందర్శించారు. ఈ సందర్భంగా హెలీప్యాడ్ విధుల్లో ఉన్న ఫార్మసిస్ట్ జస్వంత్ బెహరా అత్యంత భద్రత, కీలకమైన భారతదేశ ప్రథమ మహిళ ప్రయాణించనున్న హెలీకాప్టర్(ఛాపర్)తో సెల్ఫీలు దిగారు. జశిపూర్ సమీపం చెలిగోధులి హెలీప్యాడ్‌లో దిగిన తర్వాత రాష్ట్రపతి రోడ్డు మార్గంలో సిమిలిపాల్ జాతీయ పార్కును సందర్శించారు. ఆమె సందర్శన దృష్ట్యా ఈనెల 4, 5 తేదీల్లో సాధారణ సందర్శకుల పర్యటన నివారించారు. ఈ సందర్భంగా ప్రత్యేక విధులకు నియమితులైన సిబ్బంది రాష్ట్రపతి హెలీకాప్టర్‌తో సెల్ఫీ తీసుకోవడం సమస్యగా తయారైంది. ఈ వ్యవహారం రాష్ట్రపతి భద్రతపై ప్రశ్నలు తలెత్తడంతో జస్వంత్ బెహరా పోస్ట్‌ను తొలగించినట్లు సమాచారం.

సిబ్బందిపై వేటు..

మరోవైపు యూనివర్సిటీలో విద్యుత్ అంతరాయం ఏర్పడిన సమయంలో ముర్మును ఎందుకు సురక్షిత ప్రదేశానికి తరలించలేదని భద్రతా నిపుణులు ఇంతకుముందు ప్రశ్నించగా.. ఇది రాష్ట్రపతి కార్యక్రమాన్ని విధ్వంసం చేసే ప్రయత్నమని బీజేపీ కార్యాలయం ఆరోపించింది. రాష్ట్రపతి ప్రసంగం ప్రారంభమైన కొద్ది నిమిషాల్లోనే ఈ చిక్కు సమస్య చోటు చేసుకుంది. విద్యుత్ సరఫరా అంతరాయంతో దీపాలు ఆరిన వేదిక వద్ద ఉన్న మైక్ సిస్టమ్ ప్రభావితం కాకపోవడంతో ఆమె ప్రసంగం నిరవధికంగా కొనసాగించారు. ఉదయం 11.56 గంటల నుంచి మధ్యాహ్నం 12.05 గంటల వరకు ఈ పరిస్థితి కొనసాగిన విషయం తెలిసిందే. ఈ ఘటనతో యూనివర్సిటీ అధికారులు ఎలక్ట్రీషియన్ జయంత్ త్రిపాఠిని విధుల నుంచి తొలగించారు. పర్యటన ఏర్పాట్ల లోపాలపై విచారణకు రిజిస్ట్రార్, పీజీ కౌన్సిల్ చైర్మన్, డెవలప్‌మెంట్ అధికారితో కూడిన ముగ్గురు సభ్యుల బృందం నియమించారు. ఈ బృందం విచారణ ఆధారంగా బాధ్యులను ఖరారు చేసి తగిన చర్యలు చేపడతారు.



చెలిగోధులి హెలీప్యాడ్ వద్ద రాష్ట్రపతి ప్రయాణించనున్న హెలీకాప్టర్‌తో సెల్ఫీ దిగుతున్న ఫార్మాసిస్ట్

మణిపూర్ నుంచి సురక్షితంగా..

- స్వరాష్ట్రానికి చేరుకున్న 10మంది విద్యార్థులు
- సత్వర చర్యలు చేపట్టిన మో పొరిబార్
- ధైర్యం చెప్పి, హాకీ జెర్సీ బహూకరించిన సీఎం నవీన్



విద్యార్థులకు హాకీ జెర్సీ ప్రదానం చేస్తున్న సీఎం నవీన్ పట్నాయక్

భువనేశ్వర్: ఇంఫాల్ సెంట్రల్ అగ్రికల్చరల్ యూనివర్సిటీలో విద్య అభ్యసిస్తున్న ఒడిశాకు చెందిన 10మంది విద్యార్థులు ఆదివారం సురక్షితంగా స్వరాష్ట్రానికి చేరుకున్నారు. ఉదయం 11.10 గంటలకు భువనేశ్వర్ బిజూ పట్నాయక్ అంతర్జాతీయ విమానాశ్రయంలో చేరుకున్న వారికి మో పొరిబార్(నా కుటుంబం) డైరెక్టర్ దిలీప్ రౌత్రాయ్ స్వాగతం పలికారు. శనివారం రాత్రి సాయుధ దళాల రక్షణతో ఇంఫాల్ విమానాశ్రయం నుంచి కోల్‌కతాకు(12.15 గంటలకు) ఇండిగో విమానంలో విద్యార్థులంతా బయల్దేరారు. అంతకుముందు యూనివర్సిటీ నుంచి విమానాశ్రయానికి బయలుదేరే సమయంలో వారికి భద్రత కల్పించాలని ఒడిశా ప్రభుత్వం అభ్యర్థించింది. ప్రభుత్వం చొరవతో ప్రయాణ సమయంలో దారి పొడవునా రవాణా, వసతి వంటి ప్రత్యేక ఏర్పాట్లు కల్పించారు. అనంతరం ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ తన నివాసంలో ఇంఫాల్ నుంచి తిరిగి వచ్చిన విద్యార్థులతో సమావేశమయ్యారు. హాకీ జెర్సీని బహూకరించి, భయపడవద్దని ప్రోత్సహించారు. అలాగే తిరిగి వచ్చేందుకు సత్వర చర్యలు చేపట్టిన సీఎం నవీన్, రాష్ట్రప్రభుత్వ మో పొరిబార్‌కు విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.



మణిపూర్ నుంచి చేరుకున్న విద్యార్థులకు విమానాశ్రయం వద్ద స్వాగతం పలికిన మో పొరిబార్ అధికార వర్గాలు

తిండిలేక అల్లాడుతూ..

మణిపూర్‌లో ఆల్ ట్రైబల్ స్టూడెంట్స్ యూనియన్ ఆఫ్ మణిపూర్ ఈనెల 3న నిర్వహించిన 'గిరిజన సంఘీభావ యాత్ర' హింసాత్మకంగా మారింది. బిష్ణుపూర్, చురచంద్‌పూర్ జిల్లాల సరిహద్దు ప్రాంతంలో మైతేయి మరియు కుకి కమ్యూనిటీల మధ్య హింసాత్మక ఘర్షణలు చెలరేగడంతో మణిపూర్‌లో ఈ పరిస్థితి చోటు చేసుకుంది. ఈ ఘర్షణల్లో సుమారు 52మంది మరణించినట్లు సమాచారం. ఈ హింసాత్మక ఘటనతో రాష్ట్రానికి చెందిన పలువురు విద్యార్థులు తినడానికి తిండిలేక వివిధ వైద్య, విద్య సంస్థల్లో చిక్కుకుపోయారు. ఇంటర్నెట్, ఏటీఎంలు మూతపడ్డాయి. వారిని ఆదుకోవాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేయగా.. చర్యలు చేపట్టి, సురక్షితంగా తీసుకు వచ్చారు.

క్లుప్తంగా

ఎమ్మెల్యేను కలిసిన డీఈఓ



ఎమ్మెల్యే జోగారావును కలసిన డీఈఓ ప్రేమ్‌కుమార్

పార్వతీపురంటౌన్: జిల్లా విద్యాశాఖాధికారిగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ప్రేమ్ కుమార్ పార్వతీపురం ఎమ్మెల్యే అలజంగి జోగారావును క్యాంపు కార్యాలయం వద్ద ఆదివారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆయనకు అభినందనలు తెలియజేస్తూ జిల్లా స్థాయిలో విద్యా విధానం మరింత బలోపేతం చేయడానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ కురిటి మోహనరావు తదితరులు ఉన్నారు.

లక్ష్మీపేటలో పులి కలకలం



పులివిగా భావిస్తున్న పాదముద్రలు

కొమరాడ: మండలంలోని కంబవలస పంచాయతీ జంఝావతి రిజర్వాయర్ సమీపంలోని లక్ష్మీపేటలో పులి సంచరిస్తుందన్న సమాచారంతో గ్రామస్తులు భయందోళన చెందుతున్నారు. అటవీశాఖ అధికారులు స్పందించి పులిజాడను తెలుసుకుని, రక్షణ కల్పించాలని కోరుతున్నారు.

ప్రశాంతంగా నీట్-2023 ప్రవేశ పరీక్ష

- ఆరు పరీక్ష కేంద్రాల్లో 98 శాతం హాజరు

విజయనగరం అర్బన్: జిల్లాలోని ఐదు కేంద్రాలు, గరివిడిలోని ఒక కేంద్రంలో ఆదివారం నిర్వహించిన 'నీట్-2023 యూజీ' ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. జిల్లా నుంచి 1,477 మంది దరఖాస్తు చేసుకోగా 1,454 మంది (98 శాతం) హాజరయ్యారు.

క్రీడా రంగానికి పెద్దపీట

- సెట్విజ్ సీఈఓ శ్రీనివాసరావు



రాష్ట్రస్థాయి జూడో పోటీల్లో బంగారు పతకం సాధించిన వినీతను అభినందిస్తున్న సెట్విజ్ సీఈఓ శ్రీనివాసరావు

రామభద్రపురం: విద్యారంగంతో పాటు క్రీడా రంగానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందని సెట్విజ్ సీఈఓ శ్రీనివాసరావు అన్నారు. వేసవి క్రీడా శిక్షణ తరగతుల్లో భాగంగా మండలంలోని కొట్టక్కి ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న జూడో శిక్షణ శిబిరాన్ని ఆదివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని 22 మండలాల్లో ఒక్కో క్రీడకు సంబంధించి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని తెలిపారు. జూడో, తైక్వాండో, ఫుట్‌బాల్, బాస్కెట్ బాల్, వాలీబాల్ తదితర క్రీడల్లో శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. ఈ నెల ఒకటో తేదీ నుంచి 30వ తేదీ వరకు క్రీడా శిక్షణ తరగతులు కొనసాగుతాయన్నారు. ఇటీవల విజయవాడలో నిర్వహించిన సీఎంకప్ పోటీల్లో పలు క్రీడా విభాగాల్లో జిల్లాకు బహుమతులు తీసుకొచ్చి జిల్లా ఖ్యాతి నిలబెట్టారని తెలిపారు. కొట్టక్కి ఉన్నత పాఠశాలలో జిల్లా జూడో అసోసియేషన్ కార్యదర్శి బొత్స రత్నకిషోర్ ఆధ్వర్యంలో జూడో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్టు వెల్లడించారు. ఆరికతోట ఉన్నత పాఠశాల పీడీ వి.అప్పలనాయుడు సొంత డబ్బులతో శిక్షణ తరగతులలో పాల్గొంటున్న సుమారు 50 మంది పిల్లలకు భోజనాలు పెట్టడం అభినందనీయమన్నారు. విద్యార్థులు విద్యతో పాటు క్రీడారంగంలో రాణించాలని సూచించారు. వేసవి క్రీడాశిక్షణ తరగతులను వినియోగించుకోవాలన్నారు. ఇటీవల రాష్ట్ర స్థాయి జూడో పోటీల్లో బంగారు పతకం సాధించిన వినీతను అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రావాడ భాస్కరరావు పాల్గొన్నారు.

ఆటోబోల్తా: ఇద్దరికి గాయాలు

వంగర: మండల పరిధి అరసాడ సమీప కొండవలస జంక్షన్ వద్ద ఆటోబోల్తాపడి తండ్రీకూతుళ్లకు ఆదివారం గాయాలయ్యాయి. అరసాడ సమీపంలో మామిడితోటలు పరిశీలించేందుకు వారు వెళ్లి తిరిగి ఇంటికి వస్తుండగా ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో తండ్రి, కుమార్తె కందిశ ప్రసాద్, మాధురిలు గాయపడ్డారు. 108వాహన సిబ్బంది రాజారావు, పవన్‌కుమార్‌లు ప్రథమ చికిత్స అందించిన అనంతరం రాజాం సీహెచ్‌సీకి వైద్యం కోసం తరలించారు.

మజ్జిగౌరి సన్నిధిలో ఆంధ్రప్రదేశ్ స్పీకర్



తమ్మినేని సీతారాంకు స్వాగతం పలుకుతున్న ఏడీఎం, తహసీల్దార్

- కుటుంబ సమేతంగా దర్శించుకున్న తమ్మినేని సీతారాం
- మందిరాన్ని మరింత అభివృద్ధి చేయాలని సూచన

రాయగడ: ఉత్కళాంధ్రుల ఆరాధ్యదైవం మజ్జిగౌరి అమ్మవారిని ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం కుటుంబ సమేతంగా ఆదివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా రాయగడ తహసీల్దార్ తపస్ రౌత్, జిల్లా అదనపు మేజిస్ట్రేట్ సోమనాథ్ ప్రధాన్, మందిరం మేనేజింగ్ ట్రస్టీ రాయిసింగి బిడిక, సభ్యులు ఇప్పిలి సన్యాసిరాజు, రాధాకాంత్ దొళాయ్, సూపరింటెండెంట్ జానకీవల్లభ్ మహంతి తదితరులు ఆలయ సాంప్రదాయం ప్రకారం స్వాగతం పలికారు. ముందుగా అమ్మవారిని దర్శించుకున్న స్పీకర్ దంపతులు.. మొక్కుబడులను చెల్లించుకున్నారు. అనంతరం మందిర కార్యాలయంలో కొద్దిసేపు ట్రస్ట్ సభ్యులతో మాట్లాడారు. తెలుగు రాష్ట్రాలలో ఎంతోమంది నమ్మకంగా కొలుస్తున్న అమ్మవారి మందిరం, పరిసరాలు, భక్తుల సౌకర్యాలు మరింత మెరుగు పరచాల్సిన ఆవశ్యకత ఉందని సూచించారు. అలాగే మజ్జిగౌరమ్మను మజ్జి ఘరియాణిగా ఎందుకు పిలుస్తారని ఆయన సందేహం వ్యక్తం చేయగా.. రాజుల సమయంలోఅమ్మవారిని కోట మధ్య నిలిపి పూజించడంతో మొఘి ఘరియాణిగా కొలుస్తారని మేనేజింగ్ ట్రస్టీ పేర్కొన్నారు. ఇప్పటి వరకు మందిరం పరిసర ప్రాంతమంతా రైల్వే పరిధిలో ఉండేదని, ఇటీవల రైల్వేశాఖ అమ్మవారికి ఈ స్థలాన్ని స్థల మార్పిడి కింద మంజూరు చేయడంతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టేందుకు సన్నాహాలు చేస్తున్నామని తెలిపారు. మందిరానికి వచ్చే భక్తుల్లో దాదాపు 90శాతం మంది తెలుగు రాష్ట్రాలకు చెందిన భక్తులేనని వివరించారు.

అన్నదానానికి విరాళం..

అమ్మవారి దర్శనం చేసుకున్న స్పీకర్ తమ్మినేని.. మందిరం కార్యాలయంలోని విజిటర్స్ పుస్తకంలో దర్శనం, అనుభూతి వివరాలను రాశారు. భక్తులు కోరిన కోర్కెలు నెరవేర్చే అమ్మవారి ఆశీర్వాదం అందరిపై ఉండాలని అందులో పేర్కొన్నారు. ప్రతి ఆదివారం భక్తులకు ఉచిత అన్నదానం నిర్వహిస్తున్నట్లు తెలుసుకున్న ఆయన.. తనవంతు విరాళాన్ని అందజేశారు. అనంతరం తమ్మినేనికి అమ్మవారి ఫొటో, ప్రసాదంతో మందిరం ట్రస్ట్ సభ్యులు గౌరవించారు. అమ్మవారి దర్శనం పూర్తి చేసుకుని వస్తున్న తమ్మినే సీతారంను చూసిన ఆంధ్రప్రదేశ్‌కు చెందిన పలువురు భక్తులు.. జగనన్న జిందాబాద్ అంటూ నినాదాలు చేసారు. కొంతమంది ఆయనతో సెల్ఫీలు దిగారు. అనంతరం అందరికీ అభివాదం చేస్తూ కారులో స్థానిక సర్క్యూట్ హౌస్‌కు చేరుకున్న ఆయన.. అక్కడ కొద్దిసేపు విశ్రాంతి తీసుకుని, తిరుగు పయనమయ్యారు.



అమ్మవారిని దర్శించుకుంటున్న స్పీకర్ తమ్మినేని



అమ్మవారి ఫొటో, ప్రసాదాన్ని అందిస్తున్న మందిరం ట్రస్ట్ సభ్యులు

దాడి కేసులో నిందితుల అరెస్ట్



పోలీసుల అదుపులో నిందితులు రబీంద్ర ప్రధాన్, ప్రశాంతి ప్రధాన్

జయపురం: సాధారణమైన విషయానికి ప్రారంభమైన తగాదాలో వ్యక్తిపై గొడ్డలతో దాడికి పాల్పడిన ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. బొయిపరిగుడ సమితి దండాబెడ గ్రామంలో చోటు చేసుకున్న ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన బైధ దొళాయి(28) తన సొంత పనిపై దశమంతపూర్ వచ్చారు. తీవ్రంగా ఎండ ఉండటంతో సమీపంలోని సంతతోటలో ఉన్న ఓ హోటల్ వద్ద కూర్చొని విశ్రాంతి తీసుకుంటున్నాడు. దుకాణం యజమాని రబీంద్ర ప్రధాన్, సహచరుడు ప్రశాంతి ప్రధాన్ అక్కడ విశ్రాంతి తీసుకోకూడదని, వెంటనే వెళ్లిపోవాలని దొళాయిని ఆదేశించారు. అయితే ఎండ తీవ్రంగా ఉన్నందున కొంత చల్లబడిన అనంతరం వెళ్లిపోతానని తెలుపగా.. యజమాని వాగ్వాదానికి దిగారు. ఇది కాస్త చినికిచినికి గాలివానగా మారింది. ఈ నేపథ్యంలో దొళియాపై ఇరువురూ గొడ్డలితో దాడికి పాల్పడ్డారు. దీంతో అతని తల, శరీరానికి తీవ్ర గాయాలు కావడంతో వెంటనే కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైనకొరాపుట్ సహిద్ లక్ష్మణ నాయిక్ వైద్య కళాశాల హాస్పిటల్‌కు తరలించారు.ఈ సంఘటనపై బైద్య కుటుంభ సభ్యులు బొయిపరిగుడ పోలీసు స్టేషన్లో పిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు అరెస్టు చేసి ఆదివారం వెల్లడించారు.

ఆలోచింపజేసిన కార్టూన్లు



ప్రసంగిస్తున్న పోలీసు కమిషనర్ సౌమేంద్రకుమార్ ప్రియదర్శి



కార్టూన్ల ప్రదర్శనలు తిలకిస్తున్న సీపీ

భువనేశ్వర్: ఒడిశా కార్టూన్ అకాడమీ నిర్వహించిన ప్రపంచ కార్టూనిస్టుల దినోత్సవాన్ని కటక్-భువనేశ్వర్ జంట నగరాల పోలీస్ కమిషనర్ సౌమేంద్రకుమార్ ప్రియదర్శి ఆదివారం ప్రారంభించారు. ఐఐఎంసీ ప్రిన్సిపాల్ మృణాల్ ఛటర్జీ, సీనియర్ జర్నలిస్ట్ సందీప్ సాహు, బీబీసీ రిపోర్టర్ సంపద్ మహాపాత్ర, సీనియర్ కార్టూనిస్ట్ సుధాన్షు దేవ్, నిర్వాహక సంస్థ అధ్యక్షుడు కేకే రథ్, ఉపాధ్యక్షుడు కేశు దాస్, ఎం.శేఖర్ రావ్ తదితరులు హాజరయ్యారు. స్థానిక బుద్ధ గ్యాలరీ కాంప్లెక్స్‌లో నిర్వహించిన కార్టూన్ ఎగ్జిబిషన్‌లో రాష్ట్రం నలుమూలల నుంచి 18మంది కార్టూనిస్టులు పాల్గొని, తమ కార్టూన్లతో ఆలోచింపజేశారు. ఈ సందర్భంగా చిత్రకారులను ప్రముఖులు ప్రత్యేకంగా సత్కరించి, అభినందించారు.

రంగమార్తాండ..!

- పౌరాణిక పాత్రల్లో పరకాయప్రవేశం
- విశ్వామిత్ర, కాలకౌశిక, భీమ, ధుర్యోధనుడి పాత్రల్లో రాణింపు
- పద్మశ్రీ యడ్ల గోపాలరావు, అమరాపు సత్యనారాయణ, డీవీ సుబ్బారావులతో కలిసి ప్రదర్శన
- రంగసింహ బిరుదుతో జాతీయ స్థాయి గుర్తింపు



సత్కారం పొందుతున్న రాము

రాజాం: ఆయనొక సాధారణ రైతు కుటుబంనుంచి వచ్చిన వ్యక్తి. కళలన్నా..కళాకారులన్నా చిన్ననాటి నుంచే ఆసక్తి. ఆ ఇష్టమే ఆయనను చిన్నవయస్సుల్లోనే పౌరాణిక నాటకాలవైపు నడిపించింది. అనతి కాలంలోనే మంచి కళాకారుడిగా రాణించి ప్రజల మన్ననలతో పాటు పెద్దలు ఆశీర్వాదాలతో ఎన్నో సత్కారాలు పొందారు. ఇప్పటికీ సత్యహరిశ్చంద్ర నాటకంలో విశ్వామిత్ర పాత్ర అంటే ఆయన పేరే అందరికి గుర్తుకు వస్తుంది. నాటక రంగ సింహ బిరుదును దక్కించుకుని జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన సత్యవరపు రాము స్వగ్రామం రాజాం మండలం ఆగూరు. తన 15 వ ఏటనే పౌరాణిక రంగస్థల ప్రవేశం చేసిన సత్యవరపు రాము రైతు కుటుంబీకుడు. ఇప్పటికీ వన్నెతగ్గని నిండైన రూపంతో ప్రేక్షకులను అలరిస్తున్న ఆయన 4 వేలకు పైగా ప్రదర్శనలు ఇప్పటివరకు ఇచ్చారు.

ఇంతింతై...

చిన్నచిన్న బుర్రకథలతో నటనా జీవితాన్ని ప్రారంభించిన ఆయన అనతికాలంలోనే పౌరాణిక రంగస్థలంపై పట్టు సాధించారు. ఆయన గాత్రం బాగుంటుందని జాతీయ స్థాయి కళాకారుడు చప్పా అప్పారావునాయుడు ప్రశంసించి ప్రోత్సహించడంతో విశ్వామిత్ర పాత్రలో సత్యహరిశ్చంద్ర నాటకంలో తొలి ప్రదర్శన ఇచ్చిన ఆయన అనంతరం వీరబాహుడు, కాలకౌశికుడు, సాత్యకి సహదేవుడు, బలరాముడు, భీముడు, ధుర్యోధనుడు, అర్జునుడు వంటి పాత్రలతో పాటు హరిశ్చంద్రుడి పాత్రలో కూడా రాణించి ఎన్నో సత్కారాలు పొందారు. పద్మశ్రీ యడ్ల గోపాలరావు, అమరాపు సత్యనారాయణ, చీకటి రామారావు, కెల్ల బలరాంస్వామి, కురిటి సత్యనారాయణ, ఏవీ వేంకటేశ్వరరావు, ఎం.వై.నాయుడు, డీవీ సుబ్బారావు, మంగాదేవి, పీఎస్.మాధవ్, నెల్లూరు సుధాకర్, కిలారి లక్ష్మి, బొబ్బిలి సావిత్రమ్మ, విజయరాజు, జయనిర్మల, ఆబోతుల విశ్వనాథం తదితరుల సరసన నటించి, పోటాపోటీగా ప్రదర్శనలు ఇచ్చారు. తన 43 ఏళ్ల జీవితంలో 28 ఏళ్లుగా కళారంగానికి సేవలు అందిస్తూ వస్తున్నారు. పారితోషకమే ప్రధాన అంశంగా కాకుండా కళామ్మతల్లిపై మక్కువతో ప్రతిపోటా ప్రదర్శనకు ముందుకురావడం విశేషం.



విశ్వామిత్ర పాత్రలో రాము



అర్జునిడిగా రాణింపు



హరిశ్చంద్రుని పాత్రలో

ఐదువేలకు పైగా సత్కారాలు

కడప, కంది, మల్లయ్యపల్లె, హైదరాబాద్, తాడేపల్లి గూడెం, సామర్లకోట, విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, కాకినాడ, రాజమండ్రి ఇలా తెలుగు రాష్ట్రాల్లో చాలా ప్రాంతాల్లో ఆయన ప్రదర్శనలు ప్రేక్షకులకు కనువిందుచేశాయి. ఇత్తడి కిరీటాలు, బంగారు, వెండి బహుమతులతో పాటు పలువురు పెద్దల సత్కారాలు పొందిన ఆయనకు మందరాడ బాలభారతి కళా నాట్యమండలి రంగస్థల రంగసింహ బిరుదు అందజేసి ఘనంగా సత్కరించింది. బొబ్బిలి, పార్వతీపురం, విశాఖపట్నం, రాజాం, కవిటి, వంతరాం, కొత్తకంచరాం, ఆగూరు, రాజమండ్రి తదితర ప్రాంతాల్లో విశ్వామిత్ర పాత్రలకు ఎన్నో సత్కారాలు పొందిన ఆయన ఐదువేలకుపైగా సన్మానాలు దక్కించుకున్నారు. ఉత్తరాంధ్రస్థాయి నాటక పోటీల్లో అర్జునుడి పాత్రకు ప్రథమ బహుమతి లభించింది. తన ఇష్టమైన పాత్ర విశ్వామిత్ర అంటూ రాము సాక్షికి తెలిపారు.

వ్యక్తిగత జీవితం



పేరు : సత్యవరపు రాము
జన్మస్థలం : ఆగూరు, రాజాం మండలం, విజయనగరం జిల్లా
తల్లిదండ్రులు: అచ్చమ్మ, పాపిశెట్టి
భార్య : దుర్గమ్మ
సంతానం : ముగ్గురు ఆడపిల్లలు (ధనలక్ష్మి, పార్వతి, పద్మ)
రంగస్థల ప్రవేశం : 1995
పేరుతెచ్చిన పాత్ర : విశ్వామిత్ర

కో-ఆపరేటివ్ కాలనీలో చోరీ



ఘటనా స్థలంలో దర్యాప్తు చేస్తున్న ఎస్‌ఐ టర్కీ

రాయగడ: జిల్లా కేంద్రంలోని కో-ఆపరేటివ్ కాలనీ నాలుగో లైన్‌లో నివసిస్తున్న ఉపాధ్యాయుడు దుర్గాప్రసాద్ పండా ఇంట్లో శనివారం రాత్రి చోరీ జరిగింది. ఎవరూ లేని సమయంలో దుండగులు తలుపులు విరగ్గొట్టి, బీరువాలోని రూ.10 వేల నగదు, 2 కిలోల వెండి ఆభరణాలు ఎత్తుకుపోయారు. 3రోజుల క్రితం పండా తన కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాద్ వెళ్లారు. ఇదే అదునుగా భావించిన దుండగులు ఈ దుశ్చర్యకు పాల్పడ్డారు. ఇంటి తలుపులు తెరిచి ఉండటాన్ని గమనించిన ఇరుగు-పొరుగు వారు పండాకు విషయాన్ని తెలియజేశారు. రాయగడలో ఉంటున్న ఆయన బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ సంధ్యా టర్కీ ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు.

శాస్త్రోక్తంగా సీతారామాలయం ప్రారంభోత్సవం



రామాలయం ప్రారంభోత్సవంలో పాల్గొన్న జెడ్పీచైర్మన్ మజ్జి శ్రీనివాసరావ

కొత్తవలస: మండలంలోని తుమ్మికాపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన సీతారామాలయం ప్రారంభోత్సవాన్ని ఆదివారం శాస్త్రోక్తంగా జరిపారు. విగ్రహాల ప్రతిష్ఠ, ఆలయ శిఖర ప్రతిష్ఠ, ధేనుదర్శనం, దర్పణదర్శనం తదితర పూజలను రుత్వికులు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అనంతర సీతారామ కల్యాణోత్సవాన్ని వైభవంగా జరిపారు. జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనువాసరావు పూజల్లో పాల్గొన్నారు. భక్తులకు ఆలయ కమిటీసభ్యులు అన్నసమారాధన జరిపారు. రాత్రి పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. పూజా కార్యక్రమాలను సర్పంచ్ విరోతి కొండలరావు, మాజీ సర్పంచ్ పిల్లా అప్పలరాజు, పీఏసీఎస్ అధ్యక్షుడు గొరపల్లి శివ, రవికుమార్ తదితరులు పర్యవేక్షించారు.

అల్లూరి జీవితం స్ఫూర్తిదాయకం

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి



అల్లూరి సీతారామరాజు విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

విజయనగరం: భరతమాతను దాస్య శృంఖలాల నుంచి విముక్తురాలిని చేసేందుకు.. మన్యంలో పోరాట వీరులను తీర్చిదిద్ది తెల్లవారిని గడగడలాడించిన విప్లవ యోధుడు అల్లూరి సీతారామరాజు అని ఏపీ శాసనసభ ఉపసభాపతి కోలగట్ల వీరభద్ర స్వామి అన్నారు. దేశం కోసం చిన్న వయసులోనే ప్రాణాలను అర్పించిన అల్లూరి జీవితం స్ఫూర్తిదాయకం, ఆదర్శప్రాయమని కొనియాడారు. మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు 99వ వర్ధంతిని అల్లూరి సేవా సమితి ఆధ్వర్యంలో నగరంలోని దాసన్నపేట రైతు బజార్ కూడలి(అల్లూరి సీతారామరాజు జంక్షన్) వద్ద ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావుతో కలిసి ముఖ్యఅతిథిగా కోలగట్ల హాజరయ్యారు. ఈ సందర్భంగా అల్లూరి విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. పేదలకు వస్త్ర దానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 99 ఏళ్లు గడిచినా సీతారామరాజు ప్రజల గుండెల్లో నిలిచే ఉన్నారన్నారు. ఇటువంటి మహనీయుల వర్ధంతి, జయంతి సందర్భాల్లో సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమన్నారు. మహనీయుల ఆశయ సాధనకు ఈ ప్రభుత్వం ఎప్పుడూ కట్టుబడి ఉంటుందని స్పష్టం చేశారు. ఆ పోరాట యోధుని స్ఫూర్తిని చిరస్థాయిగా ఉంచేందుకే తమ హయాంలో దాసన్నపేట వద్ద విగ్రహం నెలకొల్పడంతో పాటు, అల్లూరి సీతారామరాజు కూడలిగా నామకరణం చేశామని గుర్తు చేశారు.



పేదలకు బట్టలు పంపిణీ చేస్తున్న దృశ్యం

పోరాటయోధుల గడ్డ ఉత్తరాంధ్ర

జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ మహనీయులను స్మరించుకోవడం ద్వారా వారి ఆశయాలను భావితరాలకు అందించగలుగుతామని చెప్పారు. పోరాట యోధులకు ఉత్తరాంధ్ర పెట్టింది పేరని ఇటీవల భోగాపురంలో పర్యటించిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి స్వయంగా అన్నారని గుర్తు చేశారు. మన్యం వీరునికి ఈ ప్రభుత్వం తగిన గుర్తింపు ఇవ్వాలన్న ఉద్దేశంతోనే ప్రత్యేకంగా ఒక ప్రాంతానికి అల్లూరి సీతారామరాజు జిల్లాగా నామకరణం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్లు కోలగట్ల శ్రావణి, ఇసరపు రేవతి దేవి, కార్పొరేటర్లు గాదం మురళి, ఆల్తి సత్య కుమారి, అల్లూరి సేవా సమితి ప్రతినిధులు పాల్గొన్నారు.

గిరిజన గ్రామాల్లో స్థిరపడిన వారికే ఉపయోగం



విలేకరులతో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం రాజన్నదొర

- డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

సాలూరు/మక్కువ: గిరిజన గ్రామాలకు నిర్మిస్తున్న రహదారులు, బ్రిడ్జిల వల్ల గిరిజనుల కంటే, ఎక్కడి నుంచో, ఇక్కడకి వచ్చి స్థిరపడినవారికే ఎక్కువగా ఉపయోగముందని డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర అన్నారు. సాలూరు మండలంలోని కొట్టుపరువు గ్రామంలో ఆదివారం ఆయన గడగడపకూ మనప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తుండగా, పలువురు గ్రామస్తులు బబ్లీఅనేరైతు రహదారి నిర్మాణానికి సహకరించడంలేదని ఆరోపించారు. అందుకు గల కారణాలను గ్రామస్తులను అడిగి రాజన్నదొర తెలుసుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ పంచాయతీలో రహదారి నిర్మిస్తే, ఉద్దేశపూర్వంగానే బబ్లీఅనే రైతు అడ్డుకుంటున్నాడన్నారు. 2008లో మావుడి రహదారి నిర్మించగా, ప్రస్తుతం పాడైందని, దానికి కారణం ఇక్కడ స్థిరపడిన రైతులు ఆయిల్‌పామ్, కంద, మొక్కజొన్న, పండ్లు నిత్యం వాహనాలపై తరలించడం వల్లనే అన్నారు. అయినప్పటికీ ఏ ఒక్కరైతు స్వతహాగా రహదారిపై ఏర్పడిన గోతులు పూడ్చడంలేదన్నారు. పంచాయతీలో రహదారి ఏర్పాటుకు నాలుగు అడుగులు ఇవ్వడానికి బబ్లీఅనేరైతు ముందుకు రావడంలేదని, దీంతో మిగిలిన రైతులంతా బాధపడాల్సి వస్తోందన్నారు. బబ్లీ విషయాన్ని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. బబ్లీఅనే రైతును, మిగిలిన రైతులంతా ఒప్పించి, రహదారి ఏర్పాటుకు సహకరిస్తారో? గిరిజనప్రాంతంగా ప్రకటించమంటారో? మీరే తేల్చుకోవాలని స్పష్టం చేశారు. బబ్లీకారణంగా పంచాయతీని షెడ్యూల్డ్ ఏరియగా ప్రకటించాల్సి వస్తుందన్నారు. గిరిజనులకు న్యాయంచేస్తూ, మరో విధంగా ఆలోచన చేద్దామని భావిస్తున్నప్పటికీ రైతులు సహకరించడంలేదన్నారు. కొట్టుపరువు మినహా మిగిలినచోట్ల రహదారుల ఏర్పాటుకు స్థిరపడిన రైతులు ముందుకు వస్తున్నారని, ఈ విషయమై రైతులంతా ఆలోచనచేయాలని డిప్యూటీసీఎం రాజన్నదొర కోరారు.

క్లుప్తంగా

'ఉద్యోగుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం'



మాట్లాడుతున్న ఏపీ అమరావతి జేఏసీ అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు

శ్రీకాకుళం పాతబస్టాండ్ : ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, ఈ నేపథ్యంలో ఉద్యమాలు మరింత ఉద్ధృతం చేయాలని ఏపీ అమరావతి జేఏసీ అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు ఉద్యోగులకు, పింఛనుదారులకు పిలుపునిచ్చారు. ఆదివారం శ్రీకాకుళం జిల్లాకు వచ్చిన ఆయన స్థానిక రెవెన్యూ అతిథి గృహంలో విలేకరులతో మాట్లాడారు. ఉద్యమాలు చేస్తే ప్రభుత్వానికి వ్యతిరేకులంటూ ముద్ర వేస్తున్నారని, ఉద్యోగులు ప్రభుత్వంలోనే భాగంగా ఉన్నారని, అన్ని పథకాలు, కార్యక్రమాలు అమలు చేస్తున్నారని చెప్పారు. వారం రోజుల్లో సీపీఎస్‌ను రద్దు చేస్తామని నాడు హామీ ఇచ్చినా ఇంతవరకు ఎలాంటి చర్యలూ తీసుకోలేదన్నారు. ఉపాధ్యాయులు వారి సమస్యపై పోరాటాలు చేస్తే ఇబ్బందులు పెడుతున్నారని, వృత్తేతర పనులు అప్పగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధ్యాయుల సమస్యలపై ఈ నెల 26న రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల కలెక్టర్లకు వినతిపత్రాలు అందజేయనున్నట్లు తెలిపారు. సచివాలయ ఉద్యోగ సంఘ నేత ఇతర ఉద్యోగ సంఘాలపైన, ఉద్యమానికి వ్యతిరేకంగా మాట్లాడటం అన్యాయమన్నారు. మూడో దశ ఉద్యమం శ్రీకాకుళం నుంచి ప్రారంభిస్తున్నామని, ఈ నెల 9న అంబేడ్కర్ ఆడిటోరియంలో ప్రాంతీయ సదస్సు నిర్వహిస్తున్నామని, అన్ని శాఖల ఉద్యోగులు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

ఉత్సాహంగా బేస్‌బాల్ జట్ల ఎంపిక



పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

శ్రీకాకుళ న్యూకాలనీ: జిల్లా సీనియర్స్ బేస్‌బాల్ జట్ల ఎంపికలు ఆద్యంతం ఉత్సాహంగా సాగాయి. శ్రీకాకుళం జిల్లా సీనియర్స్ జట్ల ఎంపిక పోటీలు ఇప్పిలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానం వేదికగా జరిగాయి. జిల్లా నలుమూలల నుంచి పురుషులు 56 మంది, మహిళలు 32 మంది హాజరయ్యారు. ఎంపిక ప్రక్రియను జిల్లా బేస్ బాల్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు కిల్లంశెట్టి అరుణకుమార్ గుప్తా, కొండపల్లి రవికుమార్ పర్యవేక్షించారు.

ప్రాబబుల్స్ జాబితా ఖరారు..

ఎంపికల్లో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులతో కూడిన జిల్లా ప్రాబబుల్స్ జట్లకు ప్రకటించారు. 20 మంది పురుషులు, 20 మంది మహిళా క్రీడాకారులను ప్రాబబుల్స్ జట్లకు ఎంపికచేశారు. ఈ నెల 8 నుంచి 11 వరకు జిల్లా పరిషత్ స్కూల్ ఇప్పిలి క్రీడా మైదానం వేదికగా శిక్షణా శిబిరాలను నిర్వహించిన అనంతరం తుది జట్లను ప్రకటిస్తామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో డీఎస్‌ఏ సీఈఓ బి.వి.ప్రసాదరావు, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి ఎం.సాంబమూర్తి, ఇప్పిలి స్కూల్ హెచ్‌ఎం తిరుమలరావు, సంఘం బాధ్యులు మూర్తి, శ్రీను, అరుణ్ క్రీడా ప్రోత్సాహకులు విజయకుమార్, రామాంజనేయులు, పీడీ పైడి సునీత, ఎక్జిక్యూటివ్ ఇంజనీర్ దాసరి కోటయ్య, నిమ్మాన శ్రీను పాల్గొన్నారు.

రాళ్లకుప్పను ఢీకొట్టి వ్యక్తి మృతి



కోటేశ్వరరావు(ఫైల్)

టెక్కలి రూరల్: నందిగాం మండలం నర్సిపురం సమీపంలో రహదారి పక్కను రాళ్లకుప్పను ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. నందిగాం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. టెక్కలి మండలం బూరగాం గ్రామానికి చెందిన దినసరి కూలీ దల్లి కోటేశ్వరరావు(50) ఆదివారం వ్యక్తిగత పనుల నిమిత్తం టెక్కలి వచ్చి తిరిగి ద్విచక్ర వాహనంపై స్వగ్రామం వెళ్తుండగా నర్సిపురం సమీంలో అదుపుతప్పి రాళ్లకుప్పను ఢీకొన్నాడు. తీవ్రంగా గాయపడటంతో హుటాహుటిన టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కోటేశ్వరరావుకు భార్య చిన్నమ్మడు, కుమార్తె కల్యాణి ఉన్నారు. నందిగాం ఎస్‌ఐ మహమ్మద్ అమీర్ అలీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య



వెంకటరమణ మృతదేహం

జలుమూరు: మండలంలోని గొటివాడ పంచాయతీ అక్కివలస గ్రామానికి చెందిన కొల్లేటి వెంకటరమణ(42) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. కూలి పనులు చేసుకొని జీవనం సాగించిన వెంకటరమణ మద్యానికి బానిసయ్యాడు. కుమార్తె దుర్గకు ఇటీవలే వివాహం చేశాడు. రోజు మద్యం తాగితే అప్పులు ఎలా తీర్చుతామని శనివారం సాయంత్రం ఇంట్లో వారు మందలించారు. దీంతో ఊరి శివారులో ఉన్న ధర్మసాగరం వద్ద పురుగులు మందు తాగి పడిపోయాడు. గ్రామస్తులు గుర్తించి శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుడికి కుమారుడు సింహాచలం ఉన్నాడు. భార్య రత్నాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పి.పారినాయుడు తెలిపారు.

అరసవల్లి క్షేత్రం.. భక్తజన సంద్రం

- ఆదిత్యుని దర్శనానికి బారులు తీరిన భక్తులు
- పుష్కరిణి ఒడ్డున సంప్రదాయ పూజలు
- గత లోపాలను సరిదిద్దుకున్న ఆలయ అధికారులు
- ఒక్కరోజులో రూ.14.50 లక్షల ఆదాయం



భక్తులకు వైద్య సాయం అందజేస్తున్న సిబ్బంది



కేశఖండన శాల క్యూలైన్లలో భక్తులు



పుష్కరిణి మెట్ల వద్ద పూజలు చేస్తున్న మహిళలు

అరసవల్లి: ప్రత్యక్ష దైవం అరసవల్లి ఆదిత్యుని క్షేత్రం ఆదివారం భక్తజనంతో కిటకిటలాడింది. ఉచిత దర్శనంతో పాటు ప్రత్యేక దర్శనాలు, విశిష్ట దర్శనాలు, కేశఖండన శాల క్యూలైన్లు, పుష్కరిణి పరిసరాలన్నీ భక్తులతో కిక్కిరిసిపోయాయి. వైశాఖ మాసం మూడో ఆదివారం సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. సంప్రదాయ పూర్వకంగా పుష్కరిణి మెట్ల వద్ద మహిళలు పూజలు చేశారు. ఆలయ ఈశాన్య గేటు నుంచే భక్తుల దర్శనాలకు అనుమతివ్వడంతో సింహద్వారం వద్ద ఇబ్బందులు లేకుండా పోలీసులు తగు చర్యలు చేపట్టారు. ఆలయ పాలకమండలి సభ్యులు మండవల్లి రవి, ద్వారపు అనూరాధ, కోటేశ్వర చౌదరి, జోగి మల్లెమ్మ, మైలపల్లి లక్ష్మి, లుకలాపు గోవిందరావు తదితరులు భక్తుల దర్శనాలకు చేసిన ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం స్వామివారిని దర్శించుకున్నారు. ప్రత్యేక ఆదివారం సందర్భంగా నిత్యార్చనలు పూర్తి చేసుకున్న అనంతరం ఉదయం 6 గంటల నుంచే సర్వదర్శనాలకు ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ అనుమతివ్వడంతో మధ్యాహ్నం 3 గంటల వరకు భక్తుల తాకిడి కొనసాగింది. జెడ్పీ సీఈఓ ఆర్.వెంకట్‌రామన్, విజిలెన్స్ ఎస్పీ ఎ.సురేష్‌బాబు తదితరులు ఆదిత్యున్ని దర్శించుకున్నారు.

భారీగా ఆదాయం..

భక్తులు భారీగా తరలిరావడంతో ఒక్కరోజులోనే రూ.14,50,148 ఆదాయం లభించింది. వివిధ దర్శనాల టికెట్ల ద్వారా రూ.10,36,400, విరాళాలు, ఆర్జిత సేవల ద్వారా రూ.53,748, ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.3.60 లక్షల వరకు ఆదాయం లభించిందని ఈవో వి.హరిసూర్యప్రకాష్ వివరించారు.

ఈసారి లోపాలు లేకుండానే..

వైశాఖ ఆదివారాల్లో వేలాది మంది భక్తులు తరలిరావడంతో స్థానికంగా ఆలయ పరిసరాల్లో చేపడుతున్న ఏర్పాట్లు పెద్దగా సరిపడడం లేదని అధికారులు ఎట్టకేలకు గుర్తించారు. ఇదే విషయాన్ని ఇటీవల 'సాక్షి'లో కథనం ప్రచురించడంతో ఈసారి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఈఓ చర్యలు చేపట్టారు. భక్తులకు ఆరోగ్య సమస్యలు రాకుండా వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. పెసలు, మామిడిపళ్లు, బెల్లం, చలిమిడి, కొబ్బరి, చెరకు, జీడిపళ్ల తదితర ఫలాలను పుష్కరిణి మెట్లపైనే స్వామికి ప్రసాదంగా నివేదించేందుకు అవకాశం కల్పించారు.

మరిడమ్మకు ప్రత్యేక పూజలు



మరిడమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఎస్పీ జీఆర్ రాధిక

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల ఆర్మ్‌డ్ రిజర్వ్ క్వార్టర్స్‌లో కొలువై ఉన్న మరిడమ్మ అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైశాఖ మాసం సందర్భంగా అమ్మవారికి భక్తి శ్రద్ధలతో పూజలు జరిపారు. ఎస్పీ జీఆర్ రాధిక ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అమ్మవారికి పట్టు వస్త్రాలు, ఘటాలు సమర్పించారు.కార్యక్రమంలో సెబ్ జేడీ వీఎన్ మణికంఠ, ఏఎస్పీ టీపీ విఠలేశ్వర్, డీఎస్పీ ప్రసాదరావు, ఆర్‌ఐలు ప్రదీప్, ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

కళింగ వైశ్యులకు వెన్నుదన్నుగా సీఎం జగన్

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్



అంధవరపు తవిటయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కృష్ణదాస్

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): కళింగ వైశ్యుల కీర్తి ప్రతిష్టలు ఇనుమడించేలా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అన్ని రంగాల్లో అవకాశాలు కల్పిస్తున్నారని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. శ్రీకాకుళం నగరంలోని పొట్టి శ్రీరాములు మార్కెట్‌లో ఆదివారం మాజీ ఎమ్మెల్యే అంధవరపు తవిటయ్య వర్ధంతి సందర్భంగా సంస్మరణ సభ ఏర్పాటు చేశారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కృష్ణదాస్ మాట్లాడుతూ కళింగ వైశ్యులు సామాజిక సేవలో ముందున్నారన్నారు. శాసనసభ్యునిగా తవిటయ్య ఎంతో ప్రజాసేవ చేశారని గుర్తు చేశారు. కళింగ వైశ్యుల సేవానిరతిని గుర్తించిన సీఎం జగన్ ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేశారన్నారు. అంధవరపు తవిటయ్య, పొట్నూరు స్వామిబాబు వంటి మహనీయుల ఆశయ సాధనకు నేటితరం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో కళింగ వైశ్య కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ పైడిశెట్టి జయంతి, జామి భీమశంకరరావు, ఊన్న నాగరాజు, అంధవరపు సురేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- మంత్రి సీదిరి అప్పలరాజు



వైఎస్సార్ యంత్రసేవలో భాగంగా ట్రాక్టర్ నడుపుతున్న మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు

మందస: అర్హులైన ప్రతిఒక్కరికీ ప్రభుత్వ పథకాలను అందజేస్తున్నామని, ప్రజల సంక్షేమమే ధ్యేయంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర పశు సంవర్థక, పాడిపరిశ్రమాభివృద్ధి, మత్స్యశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. మేజరు పంచాయతీ మందసలో ఆదివారం గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 75 ఏళ్ల స్వాతంత్ర్య భారతావనిలో 60 ఏళ్లు కుటుంబ పాలనలో మందస నలిగిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నడూ లేనివిధంగా నేడు మందస అభివృద్ధి చెందుతోందన్నారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని మళ్లీ అధికారంలోకి తీసుకురావాలని పిలుపునిచ్చారు. 2250 కుళాయిలతో మందసకు జలజీవన్ మిషన్ ద్వారా మంచినీరు ప్రతీ ఇంటికీ అందజేస్తున్నామన్నారు. అనంతరం పథకాన్ని మంత్రి అప్పలరాజు ప్రారంభించారు. రైతులకు మంజూరైన ట్రాక్టర్లు, వ్యవసాయ పరికరాలను పంపిణీ చేశారు. సర్పంచ్ చెరుకుపల్లి యల్లమ్మ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీపీ డొక్కరి దానయ్య, వైస్ ఎంపీపీ సీర ప్రసాద్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అగ్గున్న సూర్యారావు, ఎంపీటీసీలు కంచిబెహరా, దువ్వ గౌరమ్మ, పట్టణ అధ్యక్షుడు సిందిరి జగన్, ఎంపీడీఓ వాయలపల్లి తిరుమలరావు, డిప్యూటీ తహసీల్దార్ కె.విజయలక్ష్మి, పీఆర్, హౌసింగ్, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈలు కణితి కృష్ణారావు, గార రామ్మోహనరావు, ప్రసన్నకుమార్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు గిన్ని తిరుపతి రెడ్డి, శానపతి కిషోర్‌కుమార్, వై.కృష్ణమోహన్, మట్ట ఆనందరావు, దువ్వ జగదీష్, యర్నాగుల శ్రీను, కొండల ఢిల్లేశ్వరరావు, సుగ్గు కోటి, తిత్తి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా సీతారాముల విగ్రహ ప్రతిష్ట



సీతారాముల విగ్రహాలు



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

గార: అంపోలులో సీతారాముల విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం వైభవంగా జరిగింది. శుక్రవారం నుంచి ఆదివారం వరకు జరుగుతున్న ఈ మహోత్సవంలో చివరి రోజు స్వామి విగ్రహ ప్రతిష్టలను కళింకోటకు చెందిన రేజేటి శ్రీరామాచార్యులు పర్యవేక్షణలో సీతారామచార్యులు, గ్రామ పురోహితులు ఆరవెల్లి గురునాథంబాబు, జగదీష్, శ్యామసుందర శర్మ, ప్రదీప్‌శర్మల శాస్త్రోక్తంగా నిర్వహించారు. చివరిలో పూర్ణాహుతి, శాంతి కల్యాణం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ గొండు కృష్ణమూర్తి, గ్రామస్తుల సహకారంతో నిర్మించిన ఈ రామాలయ ప్రతిష్టలో భాగంగా ఆదివారం మధ్యాహ్నం భారీ అన్నసమారాధన జరిగింది. కార్యక్రమంలో నరసన్నపేట ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

ఆటో నుంచి జారి పడి వ్యక్తి మృతి

లావేరు: మండలంలోని బుడుమూరు వద్ద ఆదివారం ఆటో నుంచి జారిపడి బాలి సూర్యారావు(35) అనే వ్యక్తి మృతి చెందాడు. విజయనగరం జిల్లా చీపురుపల్లి మండలం పత్తికాయవలసకు చెందిన సూర్యారావు ఆదివారం అరసవల్లి సూర్యనారాయణస్వామి ఆలయానికి వెళ్లాడు. దర్శనం అనంతరం ఆటోలో స్వగ్రామం తిరిగి వస్తుండగా బుడుమూరు వద్ద ఆటో నుంచి జారిపడ్డాడు. తలకు బలమైన గాయాలు కావడంతో 108 అంబులెన్సులో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందాడు. సూర్యారావుకు భార్య ఉత్తర, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఏఎస్‌ఐ ప్రసాద్ కేసు నమోదు చేశారు.

లారీని ఢీకొని వ్యక్తికి గాయాలు

ఎచ్చెర్ల క్యాంపస్: కుశాలపురం బైపాస్ కూడలి సమీపంలో జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో బొద్దూరు సురేష్ అనే యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి.. బూర్జ మండల కరగాంకు చెందిన సురేష్ ఎచ్చెర్ల వైపు బైకుపై వెళ్తుండగా ముందుగా వెళ్తున్న లారీని ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో తలకు తీవ్ర గాయాలు కావడంతో నగరంలోని ఓ ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. ఎచ్చెర్ల ఎస్‌ఐ బి.సత్యనారాయణ సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సజావుగా నీట్



శ్రీ శివానీ ఇంజినీరింగ్ కళాశాల పరీక్ష కేంద్రానికి హాజరైన విద్యార్థులు

ఎచ్చెర్ల క్యాంపస్: చిలకపాలేంలోని శ్రీ శివానీ ఇంజినీరింగ్ కాలేజ్ ఆన్‌లైన్ పరీక్ష కేంద్రంలో నీట్ యూజీ పరీక్ష ఆదివారం సజావుగా ముగిసింది. మధ్యాహ్నం 2 గంటల నుంచి 5.20 వరకు పరీక్ష నిర్వహించారు. 720 మంది విద్యార్థులను ఈ పరీక్ష కేంద్రానికి కేటాయించగా, 707 మంది హాజరయ్యారు. 13 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. విద్యార్థులను ప్రత్యేక తనిఖీలు నిర్వహించి పరీక్ష కేంద్రానికి అనుమతించారు. నీట్ నిర్వహణ అధికారులు పర్యవేక్షించారు.

'మణిపూర్‌లో చదువుతున్న వారి వివరాలు అందించాలి'

శ్రీకాకుళం పాతబస్టాండ్: మణిపూర్ విద్యాసంస్థల్లో చదువుతున్న జిల్లా విద్యార్థుల వివరాలను కలెక్టరేట్‌కు అందజేయాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.రాజేశ్వరి తెలిపారు. మణిపూర్‌లో శాంతిభద్రతలకు విఘాతం కలుగుతోందని, తెలుగు విద్యార్థుల వివరాలను వెంటనే అందజేయాలని ఆమె తెలిపారు. విద్యార్థుల వివరాలను ప్రభుత్వానికి సమర్పించి తగిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. మణిపూర్ విద్యాసంస్థల్లో విద్యను అభ్యసిస్తున్న కొందరు శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్నారని, ఆ దృష్ట్యా జిల్లాకు చెందిన విద్యార్థుల కుటుంబ సభ్యులు వివరాలు అందజేయాలని కోరా రు. వివరాలు అందజేసే కుటుంబ సభ్యులు విద్యార్థి పేరు, తల్లి తండ్రుల పేర్లు, ఫోన్ నంబర్, కుటుంబం పూర్తి చిరునామా, విద్యను అభ్యసిస్తున్న నగరం తదితర వివరాలను సమర్పించాలని అన్నారు. ఈ విషయాన్ని తహసీల్దార్లు గ్రామ రెవెన్యూ అధికారులు, సచివాలయం సిబ్బందికి ఆదేశాలు జారీ చేసి వివరాలను సమర్పించాలని ఆమె ఆ ప్రకటనలో కోరారు.

చార్జీ ఇవ్వలేదని బస్సులోనుంచి తోసేశారు

- వీడిన మధురవాడ యువకుడి మృతి మిస్టరీ
- ప్రైవేటు బస్సు డ్రైవర్, క్లీనర్ అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ ఆదాం

లావేరు : ఇటీవల బుడుమూరు వద్ద జాతీయ రహదారిపై అనుమానాస్పద స్థితిలో లభ్యమైన యువకుడి మృతదేహానికి సంబంధించిన మిస్టరీ వీడింది. చార్జీ ఇవ్వలేదని బస్సులో నుంచి ప్రయాణికుడిని డ్రైవర్, క్లీనర్‌లు తోసేయడంతో ఈ ఘటన చోటుచేసుకుంది. ఇందుకు బాధ్యులైన ప్రైవేటు బస్సు డ్రైవర్ వెలమశెట్టి రామకృష్ణ, క్లీనర్ బొమ్మాళి అప్పన్నలను ఆదివారం జీఆర్‌పురం సీఐ ఎస్.ఆదాం అరెస్టు చేశారు. అనంతరం లావేరు పోలీస్ స్టేషన్‌లో విలేకర్ల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. విశాఖపట్నం జిల్లా మధురవాడకు చెందిన గేదేల భరత్‌కుమార్ ఈ నెల 2న రాత్రి తన స్నేహితులు వెంకటేష్, శివతో కలిసి శ్రీకాకుళం వచ్చాడు. 3వ తేదీ వేకువజామున 3.30 గంటల సమయంలో తాను మధురవాడ వెళ్లిపోతానని బస్సు ఎక్కించాలని స్నేహితులకు చెప్పడంతో వారు శ్రీకాకుళంలోని నవభారత్ జంక్షన్ వద్దకు తీసుకువచ్చి భువనేశ్వర్ నుంచి విశాఖపట్నం వెళుతున్న గంగోత్రి అనే ప్రైవేటు బస్సును ఎక్కించారు. ఆ సమయంలో స్నేహితులు బస్సు చార్జీ ఫోన్‌పే చేస్తామని క్లీనర్‌కు చెప్పారు. బస్సు ఎచ్చెర్ల మండలం చిలకపాలెం వచ్చినా ఫోన్‌పే ద్వారా డబ్బులు పంపించకపోవడంతో క్లీనర్ భరత్‌కుమార్‌ను చార్జీ డబ్బులు ఇవ్వమని అడిగాడు. ఈ విషయమై ఇద్దరి మధ్యా వాగ్వాదం జరిగింది. లావేరు మండలం బుడుమూరు వద్దకు వచ్చేసరికి డ్రైవర్ వెలమశెట్టి రామకృష్ణకు విషయం చెప్పగా బస్సు నుంచి తోసేయమని చెప్పాడు. దీంతో బస్సు వెళుతుండగానే భరత్‌కుమార్‌ను క్లీనర్ బస్సు నుంచి బయటకు తోసేయడంతో తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. తొలుత పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. కుటుంబ సభ్యులు మృతిపై అనుమానాలు వ్యక్తం చేయడంతో ఆ దిశలో దర్యాప్తు చేయగా ఈ విషయం బయటపడింది. సీసీ పుటేజ్ ఆధారంగా గంగోత్రి బస్సుగా గుర్తించి ఆ రోజు డ్యూటీలో ఉన్నడ్రైవర్ రామకృష్ణ, క్లీనర్ అప్పన్నలను అదుపులోకి తీసుకొని విచారించారు. చార్జీ డబ్బుల కోసం జరిగిన గొడవలో భరత్‌కుమార్‌ను బస్సులోని నుంచి బయటకు తోసేశామని డ్రైవర్, క్లీనర్ నేరం అంగీరించారని సీఐ అన్నారు. సమావేశంలో లావేరు స్టేషన్ ఎస్‌ఐ ఎ.కోటేశ్వరరావు, హెచ్‌సీ రామారావు, పీసీలు పాల్గొన్నారు.

దొంగలు హల్‌చల్

- వమరవల్లి, హుకుంపేట గ్రామాల్లో నాలుగు ఇళ్లల్లో చోరీ
- వరుసగా రెండోరోజు ఘటన
- గార మండలంలో పోలీసులు అప్రమత్తం



బాధితులతో మాట్లాడుతున్న సీఐ సన్యాసినాయుడు

గార: మండలంలో దొంగలు హల్‌చల్ సృష్టిస్తున్నారు. వరుసగా రెండో రోజూ చోరీలకు పాల్పడ్డారు. వమరవల్లి గ్రామానికి చెందిన నవగాన అప్పారావు ఇంట్లో చొరబడి బీరువాలోని 8 తులాల బంగారం, రూ.90 వేలు నగదు దోచుకెళ్లారు. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. నవగాన అప్పారావు కుమారుడు వేణుకు జూన్‌లో పెళ్లి నిశ్చయమైంది. ఈ నేపథ్యంలో ఇంటి మరమ్మతుల్లో భాగంగా ద్వారాలు మార్చుతున్నారు. అదే ఇంట్లో బీరువాను ఉంచి అదే గదిలో అప్పారావు నిద్రపోయాడు. శనివారం అర్ధరాత్రి సమయంలో దుండగలు లోపలికి ప్రవేశించి బీరువాలోని బంగారం, నగదును దోచుకెళ్లారు. అదే పంచాయతీలోని హుకుంపేటలో ఊరి చివరన తోటలకు సమీపంలోని మూడు ఇళ్లల్లో చోరీకి పాల్పడ్డారు. వేసవి కాలం కావడంతో తలుపులు తెరిచి పడుకోవడంతో సులువుగా చొరబడ్డారని స్థానికులు అంటున్నారు. బంటుపల్లి అప్పలనాయుడు ఇంట్లో నుంచి రూ.30 వేలు నగదు, అర తులం బంగారం, పూతి వెంకటరమణ ఇంట్లో రూ. 20 వేలు నగదు, దుస్తులు, ఆధార్ వంటి కార్డులున్న పెట్టె, కోళ్ల కోటేశ్వరరావు ఇంట్లో తులం బంగారం ఎత్తుకెళ్లారు. కోళ్ల కోటేశ్వరరావు ఇంట్లో ముసలమ్మ మెడలోంచి బంగారం తాడు తెంచే ప్రయత్నంలో పెద్దగా కేకలు వెయ్యడంతో అక్కడి నుంచి పారిపోయారు. విషయం తెలుసుకున్న సీఐ ఎల్.సన్యాసినాయుడు, ఎస్‌ఐ ఎం.మధుసూదనరావులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. నవగాన అప్పారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. శుక్రవారం రాత్రి రైస్‌మిల్లులో చోరీ జరగడం, మరుసటి రోజు రెండు గ్రామాల్లో దొంగతనాలు జరగడంతో పోలీసుల అప్రమత్తమయ్యారు. రెండు బృందాలును ఏర్పాటు చేసి ప్రత్యేకంగా దర్యాప్తు చేస్తున్నారు.

12 నుంచి విజయవాడలో మహాయజ్ఞం



హరిసూర్యప్రకాష్

అరసవల్లి: రాష్ట్ర ప్రజలందరి శాంతి సౌభాగ్యాల కోసం, అలాగే రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధిని కాంక్షిస్తూ ఈ నెల 12 నుంచి 17 వరకు విజయవాడలో ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో 'అష్టోత్తర శత కుండాత్మక చండీ రుద్ర రాజ్యశ్యామల సుదర్శన సహిత శ్రీ లక్ష్మీ మహా యజ్ఞం' కార్యక్రమాన్ని దేవదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లుగా జిల్లా దేవదాయ శాఖాధికారి వి.హరిసూర్యప్రకాష్ ఆదివారం తెలియజేశారు. ఈ మేరకు శాఖాపరంగా రాష్ట్ర దేవదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ ఆధ్వర్యంలో అన్ని చర్యలు చేపడుతున్నామని, ఈ మహాయజ్ఞానికి రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ దంపతులు దీక్షాధారణ చేయనున్నట్లుగా ఆయన వివరించారు. ఈ ఐదు రోజుల మహా యజ్ఞ కార్యక్రమంలో భాగంగా ఉదయం పూట పూజలు, అభిషేకాలు, హోమాలు జరుగుతాయని, సాయంత్రాల్లో వివిధ ప్రముఖ దేవస్థానాల స్వామివార్ల ఉత్సవమూర్తులకు కల్యాణోత్సవాలు, పీఠాధిపతుల అనుగ్రహ భాషణాలు, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని వివరించారు. ఈ యజ్ఞాన్ని ప్రత్యక్షంగా భక్తులు తరలివెళ్లి తిలకించాలని దేవదాయ శాఖ తరపున కోరుతున్నామని ఆయన ప్రకటించారు.

రెండు గంటలు ట్రాఫిక్ జామ్



రైలు నుంచి దింపుతున్న రైల్వే ట్రాక్ మెటీరియల్

పాతపట్నం: పాతపట్నం రైల్వే స్టేషన్ సమీపంలో ఉన్న రైల్వే గేట్ వద్ద ఆదివారం రెండు గంటల పాటు ట్రాఫిక్ జామ్ కావడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఆదివారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో గూడ్స్ రైలులో రైల్వే ట్రాక్ పట్టాల మెటీరియల్ రావడంతో రైల్వే గేటు వేశారు. మెటీరియల్ దించడానికి రెండు గంటలు పట్టడంతో అంత సేపూ రైల్వే గేటును మూసి ఉంచారు. అమ్మవారి ఆలయం వైపు రెండు కిలోమీటర్లు, పాతపట్నం వైపు మార్కెట్ వరకు సుమారు రెండు కిలోమీటర్లు బస్సులు, ద్విచక్ర వాహనాలు, ఆటోలతో పాటు పలు వాహనాలు నిలిచిపోయాయి. దీంతో పోలీసులు కూడా ట్రాఫిక్‌ను మళ్లించడానికి ప్రయత్నించప్పటికీ ట్రాఫిక్ జామ్ అయ్యింది. మధ్యాహ్నం మూడు గంటల సమయంలో గూడ్స్ రైలు గేటు దాటి వెళ్లడంతో వాహనాల రాకపోకలు సాగాయి. రైల్వే అధికారులు ముందుగా ప్రజలకు తెలియజేయకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.



కొత్తూరు: కొత్తూరులో కురిసిన భారీ వర్షం

కుండపోత

ఎల్.ఎన్.పేట, కొత్తూరు: మండలంలో ఆదివారం సాయంత్రం బలమైన గాలులతో పాటు వర్షం కురిసింది. సుమారు అరగంట పాటు గాలులతో కూడిన వర్షం కురవటంతో వీధుల్లోను, పొలాల్లోను నీరు చేరింది. ఇటుకల తయారీదారులకు, మామిడి రైతులకు వర్షంతో నష్టం జరిగింది. గాలుల కారణంగా మామిడి కాయలు రాలిపోయాయని తోటల కాపలాదారులు చెబుతున్నారు. కొత్తూరులో సాయంత్రం కుండపోత వర్షం కురిసింది. ఉరుములు మెరుపులతో పాటు ఈదురు గాలులతో కూడిన వర్షం కురవడంతో ప్రజలు ఆందోళనకు గురయ్యారు. మామిడి నేల రాలడంతో పాటు మొక్కజొన్న రైతులు ఇబ్బంది పడ్డారు. రోడ్లు జలమయమయ్యాయి.

'ప్రతి రైతుకు పాసు పుస్తకం'



సచివాలయ సిబ్బంది నుంచి వివరాలు తెలుసుకుంటున్న దృశ్యం

గార: జిల్లాలో ఇప్పటివరకు జరిగిన రీసర్వేకు సంబంధించి ప్రతి రైతుకు పాసు పుస్తకం అందజేయాలని సర్వే, ల్యాండ్ రికార్డుల రాష్ట్ర కమిషనర్ సిద్ధార్థ్ జైన్ అన్నారు. ఆయన ఆదివారం సాయంత్రం కళింగపట్నం రైతు భరోసా కేంద్రం, గ్రామ సచివాలయాన్ని సందర్శించారు. కొంతమంది రైతులతో నేరుగా మాట్లాడారు. సర్వేలో జరుగుతున్న పరిస్థితులపై అధికారులను అడిగి తెలుసుకుని పలు సూచనలు చేశారు. మొక్కజొన్న కొనుగోళ్లు త్వరితగతిన జరగాలన్నారు. గొనే సంచులు, వాహనాలను సిద్ధం చేయాలన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి ఆర్‌వీవీఎస్ ప్రసాద్, వ్యవసాయశాఖ జేడీ శ్రీధర్, మార్క్‌ఫెడ్ డీపీఎం జయంతి, తహసీల్దార్ జెన్ని రామారావు, ఎంపీడీఓ ఎస్.రామ్మోహనరావు, ఆర్‌డబ్ల్యుయస్ ఏఈ వెంకటేశ్వర్లు, తాన్నె అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.